క్లుప్తంగా

తూడిచెర్ల కాల్వకు 600 క్యూసెక్కుల విడుదల


కేసీ కాల్వకు పెరిగిన సాగునీటి సరఫరా

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల కేసీ కాల్వకు సాగు నీటి సరఫరా తగ్గించగా.. వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో కేసీ కాల్వకు సాగునీటి సరఫరా పెంచినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లాకు 1,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 600 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 580 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 20 క్యూసెక్కుల ప్రకారం విడుదల చేస్తున్నట్లు వివరించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


ఇన్వర్టర్, వాటర్ డిస్పెనరీ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999 – 2000వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రూ.40 వేల విలువజేసే ఇన్వర్టర్, వాటర్ డిస్పెన్సర్‌ను హెచ్‌ఎం రమణాచారికి శనివారం గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల సహకారం పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు నూరుల్లా, శ్రీకాంత్ రెడ్డి, మా బాషా, లక్ష్మయ్య, మద్దిలేటి, పరమేష్, శ్రీను, కిట్టు, గౌస్ పాల్గొన్నారు.

బంగారు హారం బహూకరణ


బంగారు హారం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన తుగ్గలి నాగేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి 100 గ్రాములతో తయారు చేయించిన బంగారు హారాన్ని (కాసుల పేరు) సమర్పించారు. శనివారం వారు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగాణంలోని ఆశీర్వచన మండపంలో బంగారు హారాన్ని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. దీంతో దాతలకు వేదాశీర్వచనంతో స్వామి,అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. వేదపండితులు గంటి రాధాకృష్ణ మూర్తి, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జున ఉన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ


దాతలకు ప్రసాదాలు అందజేస్తున్న సూపరింటెండెంట్

మహానంది: శ్రావణ శనివారం సందర్భంగా క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకొని శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన ప్రతాపరెడ్డి నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.10వేలు, మద్దూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి కేతంరెడ్డి శాశ్వత కల్యాణానికి రూ.5,116, శాశ్వత అభిషేకానికి రూ.5,116, కల్యాణానికి రూ.10116 విరాళం అందించినట్లు ఆయన సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి తెలిపారు.

కార్లు ఢీ.. కేసు నమోదు

బండి ఆత్మకూరు : మండలంలోని పెద్దదేవలాపురం గ్రామ సమీపంలో శనివారం రెండు కార్లు ఢీకొని ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన సత్యం తన కుటుంబ సభ్యులతో కలిసి ఏపీ 39 ఎస్‌ఎక్స్ 9693 అనే నంబర్ కల కారులో వెలుగోడు రిజర్వాయర్ చూడడానికి వెళ్తుండగా పెద్ద దేవలపురం గ్రామ సమీపంలోనికి రాగానే, అదే దారిలో ఎదురుగా వడ్డే పుల్లయ్య తన కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీ కొట్టాడు.దీంతో సత్యం తల్లి కోటమ్మ, భార్యకు రక్త గాయాలయ్యాయి. సత్యం ఫిర్యాదు మేరకు వడ్డే పుల్లయ్యపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

భక్తుల సందడి

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి.

అధికారుల నిర్లక్ష్యం..
రైతులకు శాపం

వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంలో యంత్రాంగం అనాలోచిత ధోరణితో వందలాది ఎకరాల్లో రైతులు పంటలు కోల్పోవాల్సి వచ్చింది. గేట్ల ద్వారా విడుదలైన నీరు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లోకి వెళ్లడానికి అనువైన కాల్వలు లేకపోవడంతో వాగులు, వంకలు పట్టక పొలాలను ఆ నీరు ముంచెత్తింది. పైర్లు ఐదు రోజుల పాటు నీటిలోనే మునిగిపోవడంతో కుళ్లిపోయాయి. దీంతో మొక్కజొన్న, వరి, సోయాబీన్ తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇన్‌లెట్ చానల్ నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఏటా పంటలు కోల్పోతున్నామని రైతాంగం వాపోతోంది.

పైర్లు కుళ్లిపోయాయి!

- వరదరాజస్వామి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన అధికారులు
- సరైన కాల్వలు లేని వైనం
- వాగులు, వంకల్లో ప్రవహించి పంట పొలాలను ముంచెత్తిన ప్రాజెక్టు నీరు
- 600 ఎకరాలకు పైగా పంటలు నష్టపోయిన రైతాంగం
- అధికారుల తప్పిదమంటున్న రైతులు


నీటిలో మునిగి కుళ్లిన మొక్కజొన్న పైరు

పాములపాడు: అన్నదాత పరిస్థితి రోజు రోజుకు దయనీయంగా మారుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైర్లు పూర్తిగా నీట మునిగి కుళ్లిపోయాయి. రెండు నెలల క్రితం సాగు చేసిన పైర్లను వాగులు, వంకలు పొంగి నేలపాలు చేశాయి. దీంతో అన్నదాతల పరిస్థితి అయోమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని భవనాశి నది, సుద్దవాగు, ఒడ్డుల వంకల పరివాహన గ్రామాలైన చెలిమిల్ల, ఇస్కాల గ్రామాల్లో పంట పొలాలు నీటిలో పూర్తిగా మునిగాయి. ఐదు రోజుల పాటు పూర్తిగా నీటిలోనే ఉండటంతో పైర్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. మరో నెల రోజులు గడిస్తే పంట చేతికొస్తుందనుకునే సమయంలో తీవ్ర నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, వరి, సోయాబీన్ పంటల సాగుకు ఇప్పటికే ఎకరాకు రూ.20వేల ప్రకారం ఖర్చయ్యింది.

అధికారుల తప్పిదమే..

నల్లమల అడవిలోని వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లను ఈనెల 11వ తేదీన ఎత్తడంతో భవనాశి, సుద్దవాగు, ఒడ్డులవంకకు వర్షపు నీరు భారీగా చేరింది. మూడు నీటి ప్రవాహాలు ఒక్కటి కావడంతో పైర్లన్నీ నీట మునిగాయి. ఒక్కగారిగా ప్రాజెక్టు గేట్లు ఎ త్తడం, నీరు పొలాల్లోకి చేరడం, ఆ నీరు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లోకి వెళ్లేందుకు అనువైన కాల్వలు లేకపోవడంతో పొలాల్లో నీరు సుమారు 5 రోజులుగా నిలిచిపోయాయి. అధికారులు సరైన చర్యలు తీసుకుని ఉండింటే తమకు ఇంత నష్టం వాటిల్లేది కాదని అన్నదాతలు మండిపడుతున్నారు. పైర్లు మునిగేంతటి వర్షం కురవలేదని, కేవలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడం వల్లనే తీవ్రంగా నష్టపోయామని పేర్కొంటున్నారు. చెలిమిల్ల, ఇస్కాల గ్రామాల పరిధిలో సుమారు 600 ఎకరాల కు పైగా మొక్కజొన్న, వరి, సోయాబీన్, ఇతర పంట లు నీటి పాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం



ఇస్కాలలో పంటలు కుళ్లిపోయిన అంశం తన దృష్టికి వచ్చింది. ఆర్‌ఎస్కే సిబ్బందిని వివరాలు సేకరించాలని ఆదేశించాం. చెలిమిల్ల గ్రామంలో కూడా నీట మునిగి నష్టం వాటిల్లిన పైర్లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

–మహేశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి

6 ఎకరాల్లో మొక్కజొన్న పంట పోయింది



భవనాశి నది పక్కనున్న 6 ఎకరాల్లో మొక్కజొన్న వేశా. మొన్నటి వరకు పైరు బాగానే ఉండింది. మంచి దిగుబడి వస్తుందని ఆశపడ్డాను. తీరా వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడం ఒక్కసారిగా నీళ్లు రావడం, పొలాలు మునిగిపోయాయి. ఈ నష్టాన్ని మేమెలా పూడ్చుకోవాలి.

– శ్రీనువాసులు, రైతు,ఇస్కాల

ఇన్‌లెట్ చానల్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం



భవనాశి నది, ఒడ్డుల వంక, సుద్ద వాగులు భారీ వర్షాల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తాయి. ఈ ప్రవాహానికి పొలాల్లో పైర్లు నీట మునిగి నష్టపోతారు. సమస్యకు పరిష్కారం ఇన్‌లెట్ చానల్ నిర్మాణం చేపట్టి ఎస్‌ఆర్‌ఎంసీకి నీటిని మళ్లించడమే ఏకైక మార్గం. ఈ విషయంపై సంవత్సరాల తరబడి ప్రభుత్వాలకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే ఇందుకు కారణం.

–వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి

నష్టపరిహారం చెల్లించాలి



పొలాల్లోకి నీరు చేరినా రెండు రోజుల్లో బయటికి పోయేవి. కాని వరద రాజస్వామి గేట్లు ఎత్తడం వల్ల నీరు ఎక్కువగా చేరాయి. సుమారు 5 రోజుల పాటు నీటిలోని పైర్లు ఉండటంతో కుళ్లిపోయాయి. ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి.

–కోట్ల చంద్రారెడ్డి, సర్పంచ, చెలిమిల్ల

యువతి అదృశ్యం

బండి ఆత్మకూరు : మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైందని ఎస్‌ఐ జగన్‌మోహన్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన దక్కా చింతలయ్య కుమార్తె శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయిందని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయశేఖర్ శనివారం తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ గ్రామ శివారులోని రైస్ మిల్లు వద్ద మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు..దాడి చేసి అతని నుంచి 15 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్య

నందికొట్కూరు: మిడుతూరు మండలంలోని బరక సంజీవరాయుడు స్వామి దేవాలయం పక్కనున్న వేప చెట్టుకు ఓ వృద్ధుడు ఉరేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ఓబులేసు, మృతుడి భార్య తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు మండలం 10 బొల్లవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి (79) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడని భార్య నాగేశ్వరమ్మ తెలిపింది. అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. సంజీవరాయ స్వామి దేవాలయానికి వచ్చిన భక్తులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. కుమారుడు రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

మోసం చంద్రబాబు నైజం


బాబు మోసాన్ని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: అధికారం కోసం ప్రజలకు మోసపు మాటలు చెప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నైజమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగరాజు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ఊదరగొట్టి ఇప్పుడేమో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పడం చంద్రబాబునాయుడుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. అమలుచేసే ప్రతి పథకం కాపీ కొట్టడమే తప్పా ఇంత వరకు సొంతంగా ఒక్కటంటే ఒకటి కొత్త పథకం అమలు చేసిన చరిత్ర లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని కొనియాడారు. అలాంటి నాయకత్వం మనకు మళ్లీ కావాలన్నారు. కో ఆప్షన్ సభ్యుడు ముర్తుజావలి, వలంటీర్ విభాగం ఇన్‌చార్జ్ జంషీర్, నాయకులు మాబాషా, అర్జున్, శంకర్‌గౌడు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు


గురువులతో పూర్వ విద్యార్థులు

వెలుగోడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 26 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన వారంతా తరలివచ్చారు. రెండున్నర దశాబ్దాల తర్వాత కుటుంబాలతో వచ్చి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. కమిటీ వేసుకొని మిత్రులందరినీ ఇలా కలవడం ఆనందంగా ఉందని, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని సంకల్పించారు.

గురువులను ఊరేగింపుగా..

నాడు తమకు పాఠాలు నేర్పిన గురువులను స్థానిక మదిన సెంటర్ నుంచి భాజా భజంత్రీలతో, బాణా సంచా పేలుస్తూ, పూలు చల్లుతూ ఊరేగింపుగా పాఠశాల వద్దకు తోడ్కొని వెళ్లారు. సరస్వతి పూజ నిర్వహించి గురువులతో జ్యోతి ప్రజ్వలన చేయించారు. అమరులైన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు హస్సైన్ ,శివకుమార్, చంద్రశేఖర్ రెడ్డి, ఉర్దూ మున్ని గని, రాబర్ట్, రవీంద్రుడు, మహమ్మద్ ఇక్బాల్, ఎం ఈ ఓ బ్రహ్మం నాయక్ ప్రస్తుత ఉపాధ్యాయులు మగ్బుల్ బాషా ,ముజాహిద్ బాషా, శమీఉన్నిసా, సంజీవరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అక్బర్, మోమిన్ వలి, అబ్దుల్ అజీస్, రవి శంకర్ శర్మ, మహమ్మద్ రఫీ మొహమ్మద్ షఫీ సుల్తాన్ మొహిదీన్ ,మొయినుద్దీన్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం


ఆత్మకూరు: తోటగేరిలో ఉట్టి కొడుతున్న దృశ్యం


నందికొట్కూరులో పూజలందుకున్న శ్రీ కృష్ణుడు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణం, మండలంలోని గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శ్రీపతిరావుపేట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సుద్దుల రచ్చబండ వద్ద శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సాయంత్రం కోలాటాల నడుమ గ్రామంలో కృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. ఉట్టిగొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని తోటగేరిలో ఉట్టి వేడుకల్లో పాల్గొన్నారు. కరివేన గ్రామంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని యాదవులు గ్రామ పురవీధుల్లో ఉట్టి కార్యక్రమం చేపట్టారు.

- పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామ శ్రీ కృష్ణుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధా, కృష్ణుల కల్యాణమహోత్సవాన్ని పండితుల వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం ప్రజలకు పానకం పంపిణీ చేశారు.
- జూపాడుబంగ్లా: శ్రీకృష్ణాష్టమిని మండలంలోని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో స్వామివారి విగ్రహాలు, చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.


తర్తూరులో విశేష అలంకరణలో లక్ష్మీరంగనాథస్వామి

- కొత్తపల్లి: స్థానిక రాధాకృష్ణాలయంలో రాధాకృష్ణ ఉత్సవమూర్తులకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పెద్దగుమ్మడాపురంలోని, చిన్నగుమ్మడాపురం, ఎర్రమఠం, శివపురం, దుద్యాల గ్రామాలలో శ్రీ కృష్ణుని చిత్రపటాలను, విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు.
- నందికొట్కూరు: పట్టణంలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకల ముగింపు కార్యక్రమం శ్రీ ఆచార్య ప్రబోధానంద ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించారు.
- మహానంది: మండల కేంద్రం తిమ్మాపురంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ అనంతరం సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అలరించాయి.


పాములపాడులో రాధా,కృష్ణుల కల్యాణం


తిమ్మాపురంలో చిన్నారుల కోలాటం


తంగడంచలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కొత్తపల్లి రాధాకృష్ణాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సందర్భంగా శనివారం అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కల్లూరి పెద్ద మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ రావాల్సిన డీఏ బకాయిలు, ఇంటీరియర్ రిలీఫ్ అందించాలన్నారు. జాయింట్ సెక్రటరీ జనార్ధన్, భారతమ్మ, నర్సింగ్ ఆఫీసర్ ప్రీతి, జీడీఏ స్వాతి, రమేష్, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న ఏసురత్నం

పాములపాడు: కార్మికులంతా ఏకమై హక్కుల సాధనకు పోరాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్కీం వర్కర్లకు రూ.26వేల వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడి ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని కోరారు. విశాఖపట్నంలో జరిగే అఖిల భారత మహాసభలకు హాజరు కావాలని తెలిపారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా శివలక్ష్మి, కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, పరమేశ్వరుడు, సహాయ కార్యదర్శిగా వెంగమ్మ, రమణబాయి, మౌలాలి, నాగశేషులు, అన్వర్, ఆవులయ్య, నాగన్న, సురేష్, నాగమణి, రమణమ్మలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్వామన్న పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని వినియోగించుకోండి

వెలుగోడు: ఆయుర్వేదంలో అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, ఆయుర్వేద వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సురేష్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీ పరిధిలోనున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో శనివారం రోగులకు ఆయుర్వేద వైద్య సేవలు, మందులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేదం మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్‌కు అవకాశం లేదన్నారు. మొండి రోగాలకు సైతం చికిత్స ఉందన్నారు. ఆయుర్వేదం ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని, ప్రకృతిలో దొరికే చిన్న మూలికలు కూడా ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయని చెప్పారు. అలాగే.. జాజికాయ వినియోగించడం వల్ల కలిగే లాభాలను వివరించారు.

బాలికకు ప్రతిభ అవార్డు


షేక్ ఇర్షద్‌తో ముచ్చటిస్తున్న గవర్నర్

నందికొట్కూరు: పట్టణానికి చెందిన ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ షుకూర్ మనవరాలు షేక్ ఇర్షద్ గతేడాది పదో తరగతిలో 599 మార్కులు సాధించడంతో శుక్రవారం గవర్నర్ ప్రతిభ అవార్డు అందజేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు.